క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మున్సిపల్ కమిషనర్ గణేష్‌బాబుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నారాయణదాసు బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు సదుర్ల శంకర్, సదుర్ల సురేష్, నారాయణదాసు చంద్రశేఖర్, శాంతన్న, ఆరేపల్లి రాజేష్, దొడ్ల వరదరాజు, ఆంజనేయులు, కృష్ణ, రవి, ఏముగడ్డ పరమేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



అమరచింత: మండల కేంద్రంలో శుక్రవారం ఏఐవైఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆయా సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈమేరకు ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రతతో పాటు వ్యవసాయ కార్మికులకు భరోసా పథకం ద్వారా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో జాబ్‌కార్డులు కోల్పోయి ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, నాయకులు విజయరాములు, అజయ్, రమేష్, శ్యాంసుందర్, కుతుబ్, ఎర్రన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు రవికుమార్‌యాదవ్, తిరుపతయ్య, రాములు, శేఖర్, కుమార్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రకాష్, అంజి, ఆనంద్‌గౌడ్, భారతీయుడు, ఇస్మాయిల్, నాగరాజు తదితరులు ఉన్నారు.

రూ.2.22 లక్షల ఎల్వోసీ అందజేత

వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన కుమ్మరి అబ్దుల్లా గుండెనొప్పితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవికిరణ్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.2.22లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ కాపీని శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బాధితుడి కుమారుడు భీముడుకు అందజేశారు. కార్యక్రమంలో నక్కరాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి



కొత్తకోట రూరల్: బీసీ పొలిటికల్ జేఏసీ వనపర్తి జిల్లా కార్యదర్శిగా మండలంలోని రాయిణిపేటకు చెందిన బత్తుల జితేందర్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ శుక్రవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలను చైతన్యం చేసి వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తూ, బీసీల రాజ్యాధికారం కోసం పాటుపడతానన్నారు. కార్యక్రమంలో అంజన్నయాదవ్, మహేందర్, గౌతంగౌడ్ తదితరులు ఉన్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు



మదనాపురం: మండలంలోని గోపన్‌పేట, నరసింగాపురం గ్రామాల్లో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో మొత్తం 101 మందికి క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ రాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌టీలు ముజాఫర్, రతన్, ఏఎన్‌ఎంలు లక్ష్మమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ప్రభుత్వ పథకాల అర్హుల వివరాలు పకడ్బందీగా సేకరించాలి



అమరచింతలో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్న మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట రూరల్/ఆత్మకూర్/అమరచింత/మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పకడ్బందీగా జరగాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. పథకాలకు అర్హుల గుర్తింపు విషయమై శుక్రవారం కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, మదనాపురం తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం మండలంలోని రాయిణిపేటలో, ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో పర్యటించి సందర్శించి పథకాలకు అర్హుల గుర్తింపు సర్వే జరిగే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా అమలు కోసం మండలంలో వ్యవసాయేతర, నాలా భూముల గుర్తింపు ప్రక్రియ వేగవంతంగా చేయాలని ఆదేశించారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

క్షేత్ర స్థాయిలో వ్యవసాయేతర భూములను గుర్తించే ప్రక్రియను చేపట్టిన వ్యవసాయ విస్తరణ అధికారులకు తహసీల్దార్, ఎంపీఓ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. అలస్యం చేయకుండా వ్యవసాయేతర భూములు, లే అవుట్లు చేసినవి, భూసేకరణ చేసినవి తదితర భూములను గుర్తించాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల జాబితాను వెంటబెట్టుకుని పంచాయతీ కార్యదర్శులు అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.



పాన్‌గల్ మండలం శాగాపూర్‌తండాలో..

జాబ్ కార్డు ఆధారంగా..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి మండలంలో ఉన్న జాబ్ కార్డుల ఆధారంగా కుటుంబ ఆర్థిక స్థితిగతులు, వారి పేరుపై ఏమైనా భూమి ఉన్నదా అనే వివరాలు పరిశీలించాలన్నారు. ఉపాధి హామీ కూలీల జాబితా ఆధారంగా వారి ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు సరిగా ఉన్నాయా లేవా అని పరిశీలించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసిన సర్వే ఆధారంగా తయారు చేసిన జాబితాపై సూపర్ చెక్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక అధికారులు బీరం సుబ్బారెడ్డి, రామమహేశ్వర్, డీపీఓ సురేష్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, చాంద్‌పాషా, రవికుమార్, అబ్రహం లింకన్, ఎంపీడీఓలు శ్రీరాంరెడ్డి, ప్రసన్నకుమారి, చెన్నమ్మ, శ్రీనివాసులు, ఏఓలు అరవింద్, వినయ్‌కుమార్, ఏఈ రుక్వేందర్‌రెడ్డి, కమిషనర్లు శశిధర్, నురుల్‌నదీం, వ్యవసాయ అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వివరాలు పకడ్బందీగా సేకరించాలి

పాన్‌గల్: ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల కోసం అర్హులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేలో వివరాలను పకడ్బందీగా సేకరించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఏఓ రాజవర్ధన్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలోని 5 క్లస్టర్లలో సర్వే ప్రారంభం కాగా.. టీంకు ముగ్గురు చొప్పున మొత్తం 84 మంది సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, ఎంపీఓ రఘురాములు, డీటీ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు మహేష్, తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు

చిన్నంబావి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వం ఇచ్చిన పథకాలనే అందిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధారాసింగ్ మండిపడ్డారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రిగా ఏళ్లుగా అధికారం అనుభవిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు ఏ మొఖం పెట్టుకొని చిన్నంబావి మండలానికి వస్తున్నారని ప్రశ్నించారు. ఆయన గత ఎన్నికల సమయంలో చిన్నంబావి మండలానికి ఆరు నెలల కాలంలోనే సాగునీటి కష్టాలు తీర్చే సింగోటం–గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పూర్తి చేస్తామని, అదేవిధంగా మండలకేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ భవనాలు నిర్మిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. మండలంలో ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు ఉన్నా.. వాటిని పరిష్కరించకుండా కేవలం స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మండలంలో పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో గోపినాయుడు, ఓబీసీ సెల్ జిల్లా నాయకులు చెన్నయ్య, సాయిప్రణీత్‌గౌడ్, పురేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధారాసింగ్

ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక విడుదల

కొత్తకోట: పట్టణంలో ఎంతో మహిమ, విశిష్టత కలిగిన భవానీశంకర ఆలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఆలయంలో నూతనంగా శిఖరాలు, ధ్వజ స్తంభం ఏర్పాటు చేసిన సందర్భంగా ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రతిష్ఠోత్సవం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఆహ్వాన, కర పత్రికలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా ఆలయ కమిటీ తరపున పోగాకు రాఘవేంద్రప్రసాద్‌కు పట్టణ ప్రముఖులు ఆహ్వాన పత్రికను అందజేశారు. 8న కలశ పూజ, 9వ తేదీ నవగ్రహ పునఃప్రతిష్ఠ, 10న ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మఠం సదాశివయ్య, ఆలయ కమిటీ సభ్యులు పోగాకు రాఘవేంద్రప్రసాద్, విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, గుంత మౌనిక, పాపయ్యగారి చంద్రశేఖర్, పల్లెపాగు ప్రశాంత్, దాబా శ్రీనివాస్‌రెడ్డి, వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు, హిందూ వాహిని సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

పాన్‌గల్: గ్రామాల్లో ఉండే ప్రతి గర్భిణి పేరు నమోదు చేసి వారికి మెరుగైన వైద్యం అందించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) రామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం, వ్యాయామం చేయాలన్నారు. పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకుంటే ప్రభుత్వం అందించే ప్రోత్సాహాలను తెలియపర్చాలన్నారు. 102 వాహనం, అంబులెన్స్ వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమనశ్రీ, హెల్త్ అసిస్టెంటు శ్రీలక్ష్మి, ఆశాకార్యకర్తలు సంధ్య, చిన్నమ్మ, కవిత, ప్రమీల పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

ఆరోగ్యం.. ఆత్మీయం

- ఆరోగ్య వాకింగ్ క్లబ్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం
- 60 కుటుంబాలు, 200 మంది ఒకే చోట

కొత్తకోట: కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఏర్పాటు చేసి 10 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. అందులో సభ్యులుగా ఉన్న 60 కుటుంబాలకు చెందిన 200 మంది శుక్రవారం ఒకేచోట కలుసుకున్నారు. మండలంలోని విలియంకొండ సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆరోగ్య వాకింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పలుస శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో కుటుంబ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుస శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనాలు మానవతా విలువలు, సామాజిక బాధ్యతలు, కుటుంబ ఎదుగుదలకు తోడ్పాటునిస్తాయన్నారు. ఇందులో భాగంగా మహిళలకు ఆట పోటీలు, చిన్నారులకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాకింగ్ సభ్యులు ఎల్లయ్య, నాగేష్, ఎల్లస్వామి, బాలకృష్ణారెడ్డి, ముంత రవియాదవ్, రామకృష్ణ, జగన్‌మోహన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, విజయ్, శ్రీను, చీర్ల రమేష్, లక్ష్మీరెడ్డి, రవీందర్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆరోగ్య వాకింగ్ క్లబ్ కుటుంబ సభ్యులు

రెండు బైక్‌లు ఢీకొని మహిళకు గాయాలు

వనపర్తి రూరల్: ముందు వెళ్తున్న బైకును వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన గొల్ల అలివేల భర్తతో కలసి బైక్‌పై జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తూ గ్రామంలో వారి ఇంటికి మళ్ళుండగా వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడి గొల్ల అలివేలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు బాధితురాలిని వనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో షార్ట్‌సర్క్యూట్

అమరచింత: పట్టణంలోని నాల్గో వార్డులో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సమయంలో సదరు కాంట్రాక్టర్ ఎల్‌సీ తీసుకోకపోవడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో తొమ్మిది, నాల్గో వార్డులోని పలు ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, బల్బులు కాలిపోయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని కుమ్మరివాడలో విద్యుత్ పనుల కోసం కాంట్రాక్టర్ విజయ్ నాలుగు కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడానికి పనులు కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో స్తంభం పైకి ఎత్తడంతో రెండు ఫేస్ వైర్ తగిలి షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. కుమ్మరివాడలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సైతం పొగలు కక్కడంతో కాలనీ ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఉర్దూమీడియం సమీపంలోని మినరల్ వాటర్ కేంద్రానికి సంబంధించిన బోరు సైతం కాలిపోయింది. కేవలం కాంట్రాక్టర్ తప్పిదం వల్లే ఇది జరిగిందని ఎల్‌సీ తీసుకోకపోవడం, లైన్‌మెన్ అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారమని పట్టణ ప్రజలు తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

పాన్‌గల్: దాడి చేసిన ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ముగ్గురిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండలంలోని సింగాయిపల్లికి చెందిన పూర్వకంటి బాలరాజు అనే వ్యక్తికి మండలంలోని కదిరెపాడు గ్రామానికి చెందిన విజయమ్మతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ గొడవలతో ఏడాది క్రితం విజయమ్మ ముగ్గురు కుమార్తెలను తీసుకొని తల్లిగారి గ్రామం కదిరెపాడుకు వెళ్లి అక్కడే ఉంటోంది. ఈనెల 15వ తేదీన పూర్వకంటి బాలరాజు తన కుమార్తెలను చూసేందుకు కదిరెపాడు వచ్చి భార్యతో మాట్లాడుతుండగా.. భార్య విజయమ్మ, మరదలు రేణుక, బావమర్ది వీరపాగస్వామి కలిసి పరుషపదజాలంలో దూషిస్తూ కట్టె, రాళ్లతో దాడి చేయడంతో బాలరాజు తలకు రక్తగాయం, శరీరానికి కమిలిన గాయాలయ్యాయి. ఘటనపై శుక్రవారం బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

అమరచింత: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి ఆత్మకూర్ మున్సిఫ్ కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా ఒకరికి రూ.వెయ్యి జరిమానా, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించారని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. చిన్నచింతకుంట మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన మహిమూద్‌కు రూ.వెయ్యి జరిమానా, గోవింద్, ఖాసీమన్న కు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. అలాగే తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాల గురించి ఆరా తీశారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అనువైన సౌకర్యాలు ఆస్పత్రిలో ఉన్నాయని పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు. మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి స్థానిక కిడ్నీ సంబంధిత రోగులు డయాలసిస్ కోసం పడుతున్న ఇబ్బందులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు విన్నవించడంతో.. స్పందించిన ఆయన డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సానుకూలంగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరినారాయణ, డాక్టర్ నిస్సార్‌అహ్మద్, డయాలసిస్ టెక్నీషియన్లు అజ్ముతుల్లా, సుధీర్, కాంగ్రెస్ నాయకులు కుర్ని రవికాంత్, రహ్మతుల్లా, తులసీరాజ్, అనీస్, నాగాంజనేయులు, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.



ప్రభుత్వాస్పత్రిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



సోళీపురంలో బడికి రాని విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ జయశంకర్

ఆత్మకూర్: రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ నిర్వహిస్తున్న బడి బయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా మండలంలో సర్వే వేగవంతంగా కొనసాగుతుంది. సీఆర్పీ సౌమ్యరాణి, ఈఆర్టీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గ్రామాల్లో బడి బయటి పిల్లల వివరాలను నమోదు చేశారు. పాఠశాల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఖిల్లాఘనపురం: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం 'పిల్లలు బడిలో–పెద్దలు పనిలో' కార్యక్రమాన్ని చేపట్టిందని మండల విద్యాధికారి జయశంకర్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మండలంలో శుక్రవారం నుంచి ఇంటింటి సర్వే చేపట్టారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరిని బడిలోనే చేర్పించాలని కోరారు. సోళీపురం గ్రామంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.నందిని చాలా కాలంగా పాఠశాలకు రాకపోవడంతో తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపిచేలా ఒప్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ సీఆర్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు తొలగించండి

అమరచింత: మస్తీపురంలో వెలసిన శ్రీహజరత్ హాజిమలాంగ్ బాబా దర్గా ఉర్సోత్సవాలు ఈనెల 21న నుంచి ప్రారంభం అవుతున్నాయని, రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం జామీయా మసీదు కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. ఈమేరకు మసీదు కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమరచింత పట్టణం నుంచి మస్తీపురం దర్గాకు కచ్చ రహదారి ఉందన్నారు. రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు పెరగటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ ముళ్ల పొదల తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ముర్షద్ మైనోద్దీన్, ఖాసీం, తౌఫిక్, పాషా తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

శివమాలధారణ దీక్షలు ప్రారంభం



కోటిలింగేశ్వర ఆలయంలో శివ మాలధారులు

కొత్తకోట: మండలంలోని కానాయపల్లి స్టేజీ వద్ద గల శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దేవస్థానంలో శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు శివ మాలాధారణ చేశారు. అర్చకులు అనిల్, జగదీష్ వేద మంత్రాలతో సంకల్ప పూజలు నిర్వహించి, రుద్రాక్ష మాలలను శివ మాలధారుల మెడలో అలంకరించారు. అనంతరం ధ్యాన మందిరంలో ప్రతిష్ఠించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగానికి అభిషేకం నిర్వహించి, శివ దీక్ష నియమాలను మాలధారులకు వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మదనాపురం: మండలంలో శివ మాలధారుల దీక్షలు ప్రారంభమయ్యాయి. నరసింగాపురం అభయాంజనేయస్వామి ఆలయంలో గురుస్వామి పెద్ద బ్రహ్మయ్యచారి ఆధ్వర్యంలో శివ మాలధారులు ప్రత్యేక పూజ నిర్వహించారు.

జ్యోతిబసుకు ఘన నివాళి

వనపర్తి రూరల్: సీపీఎం నేత, మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండీ జబ్బార్, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పలువురి నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి 1996లో ప్రధాని అయ్యే అవకాశం లభించినా.. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి అవకాశాన్ని వదులుకున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, గోపి, లక్ష్మి, రాజు, పరమేశ్వరాచారి, నందిమళ్ల రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిబసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మూడు మండలాల ఏర్పాటుకు చర్యలు

- ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి
- పలుగ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమిపూజ



షాపురంలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఖిల్లాఘనపురం: నియోజకవర్గంలోని మూడు పెద్ద గ్రామ పంచాయతీలను మండలాలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఉదయం మండలంలోని సోళీపురం గ్రామానికి చేరుకున్న ఆయన రూ.15 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఉన్నత పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉప్పరిపల్లికి వెళ్లే రోడ్డుకు రూ.5 లక్షల ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు, షాపురంలో రూ.10 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. మామిడిమాడ ముందలితండా, మల్కిమియాన్‌పల్లి గ్రామాల్లో ఒక్కో గ్రామంలో రూ.20 లక్షల ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనాలు, వెనికితండాలో రూ.8 లక్షల ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించే అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. మానాజీపేటలో సర్వే నెంబర్ 25లో గతంలో కేటాయించిన ప్లాట్ల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మల్కాపురంలో గ్రామానికి కాల్వ ద్వారా వచ్చిన కృష్ణా నీటికి పూలు చల్లి పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బాదం సరోజాదేవి కల్యాణ మండపంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైనారు.

26 నుంచి నాలుగు హామీల అమలు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఈ నెల 26 నుంచి నాలుగు హామీలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. రైతు భరోసా, భూమి లేని రైతులకు రూ.12 వేల అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించేందుకు ఇప్పటికే గ్రామాల్లో సర్వేలు జరుగుతున్నాయన్నారు.

పట్టాలు ఇప్పిస్తా

మండలంలో తాతల కాలం నాటి నుంచి రాజుల పేరున ఉన్న భూములను సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు పట్టాలు ఇప్పించేందుకు ఐదు తండాల నుంచి ఇద్దరు చొప్పున 10 మందిని తీసుకెళ్లి రెవెన్యూశాఖ మంత్రితో మాట్లాడిస్తామని హామీనిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, మాజీ చైర్మన్లు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ క్యామ రాజు, డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు ఆగారం ప్రకాష్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.